క్లుప్తంగా

సన్మానం



నర్సంపేట : బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఈసీ మెంబర్‌గా ఎన్నికైన చెన్నారావుపేటకు చెందిన న్యాయవాది మర్రి రాజును చెన్నారావుపేటలో 1995 పదో తరగతి బ్యాచ్ మిత్రులు ఆదివారం పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజు స్నేహితులు కుండె కుమారస్వామి, దొంతి మంజుల, ముదురు రమేశ్, కలకోటి వీరభద్రయ్య, గోపు భూపాల్ రెడ్డి, బొంత రవీందర్, కేశబోయిన నర్సింహారాములు ఉప్పుల వీరస్వామి, దొంతి సంతోశ్, వరంగంటి సంతోశ్, చెవ్వ రాజేంద్రప్రసాద్, కుసుమ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నల్లబెల్లి : మెపా జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని బొల్లోనిపల్లికి చెందిన పోలుదాసరి రామును నియమించినట్లు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడారు. రాజకీయకాలకు అతీతంగా విద్యా, ఉద్యోగ సాధికారత కోసం మెపా ముందుకు సాగుతుందని చెప్పారు. తన నియామకం కోసం కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ



నల్లబెల్లి : హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో జరుగనున్న రగ్బీ సీనియర్ మీట్‌లో పాల్గొననున్న 48 మంది క్రీడాకారులకు రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సారంగపాణి ఆదివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో అసోషియేషన్ సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అసోషియేషన్ సెక్రటరీ మంగపల్లి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, హైదరాబాద్ అసోసియేషన్ సెక్రటరీ ఐత శ్రీకాంత్, వరంగల్ అసోసియేషన్ సెక్రటరీ ఉడుతల శ్రీకాంత్, కరీంనగర్ అసోసియేషన్ సెక్రెటరీ రంగు నిరంజన్ చారీ, తదితరులు పాల్గొన్నారు.

'సీఎంఆర్ఎఫ్' అందజేత



నల్లబెల్లి : మండలంలోని నారక్కపేటకు చెందిన సముద్రాల కొమురమ్మ కుటుంబానికి మంజూరైన రూ.51,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ ఆదివారం అందజేశారు. అనంతరం అశోక్ మాట్లాడారు. కొమురమ్మ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థికసాయం మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపతి సుమన్, పాగుల కుమారస్వామి, కేతే రాజేందర్, ఎంబడి కరుణాకర్, అడిచర్ల శ్రీనివాస్, బొడిగె సుమన్, కోడూరి రాజశేఖర్, కావటి గణేశ్, హుస్సేన్, కలిమి రాజశేఖర్, మాడుగుల చంద్రమౌళి, ఉప్పుల మహేశ్, గొట్టిముక్కల శ్రీధర్, దండెం శంకర్‌లింగం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు నేడు, రేపు సెలవు

నర్సంపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు నేడు (సోమవారం), రేపు (మంగళవారం) సెలవు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా నేడు (సోమవారం), మంగళవారం వారంతపు సెలవు ఉంటుందని పేర్కొన్నారు. రైతులు నేడు, రేపు మార్కెట్‌కు సరుకులు తీసుకురావద్దని కోరారు. మార్కెట్ బుధవారం ప్రారంభం అవుతుందని వివరించారు.

'గ్యాస్ ధర పెంపును ఉపసంహరించుకోవాలి'

నర్సంపేట : గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకుడు జన్ను రమేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెన్నారావుపేటలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలపై భారాలు మోపుతూ ప్రభుత్వం వంట గ్యాస్ ధరల పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజలపై తీరని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్, ఇతర నిత్యావసరాల ధరలను తగ్గించేంత వరకు పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

రిజర్వాయర్ ఉన్నా సాగునీటి కష్టాలు

● కాల్వ లేక, మరమ్మతులు చేయక ఇబ్బందులు

పర్వతగిరి : వ్యవసాయ భూములకు నీరందించేందుకు పెద్దచెరువు రిజర్వాయర్ ఉన్నప్పటికీ ఓ చోట కాల్వ లేక, మరో చోట కాల్వ మరమ్మతుకు నోచుకోక, ఇంకోచోట కాల్వ ఆక్రమణకు గురై రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. పంటలకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం, ఎమ్మెల్యే, రాజకీయ నాయకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండల కేంద్రంలో 2006లో సుమారు రూ.8 కోట్ల వ్యయంతో 0.22 టీఎంసీ సామర్థ్యంతో పెద్దచెరువు రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్ నిర్మాణంలో నాణ్యత లోపించడంతో 2018లో నాటి మంత్రి కడియం శ్రీహరి చొరవతో రూ.20 కోట్ల వ్యయంతో రిజర్వాయర్‌ను పునర్నించారు. ఈ రిజర్వాయర్ నుంచి 2500 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాగా పర్వతగిరి నుంచి కల్లెడ దిశగా ఉన్న కాల్వ పూర్తిగా పాడైపోవడంతో పర్వతగిరి పరిధిలో కొంత మేరకు మాత్రమే సాగునీరు అందుతోంది. ఈ కాలవను కొందరు ఆక్రమించి ఇండ్లు కట్టుకున్నారు. పోలుకమ్మ చెరువుకు వెళ్లే కాల్వ మరమ్మతులకు నోచుకోకపోవడంతో పరిసర ప్రాంతాల వ్యవసాయ భూముల రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే రిజర్వాయర్‌కు కిలోమీటర్ దూరంలోనే ఉన్న దౌలత్‌నగర్ ఊర చెరువుకు కాల్వ నిర్మించలేదు. దీంతో పక్కనే రిజర్వాయర్ ఉన్నా దౌలత్‌నగర్ శివారు రైతులకు నీరు అందని దుస్థితి నెలకొంది. ఇకకైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వల మరమ్మతు, నిర్మాణం, ఇతర సమస్యలను సత్వరమే పరిష్కరించి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



పర్వతగిరి పెద్దచెరువు రిజర్వాయర్



కాల్వ లేకపోవడంతో వృథాగా పోతున్న నీరు

రిజర్వాయర్ నిర్మించినా ఫలితం శూన్యం

రిజర్వాయర్ పక్కనే భూములున్నా కాల్వల నిర్మాణం సక్రమంగా లేక పొలాలకు నీరు అందడం కష్టంగా ఉంది. ప్రభుత్వం స్పందించి కాల్వల నిర్మాణం, మరమ్మతు, అవసరమైన ఇతర పనులు చేపట్టాలి. కోట్ల రూపాయలు వెచ్చించి రిజర్వాయర్ నిర్మించినా రైతులకు ఆశించిన ఫలితం ఉండడం లేదు. రిజర్వాయర్ నీటిని ఉపయోగించే కొత్త విధానానికి నాంది పలకాలి.

\- వర్ధినేని సుధీర్‌రావు, రైతు, పర్వతగిరి

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించలేదు. కాల్వలు నిర్మించే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా. దౌలత్‌నగర్ ఊర చెరువుకు కొత్తగా కాల్వ నిర్మించాల్సి ఉంటుంది. అలాగే పర్వతగిరి, కల్లెడ పాత కాల్వను పునరుద్ధరించాల్సి ఉంది. కాల్వ ఆక్రమణకు గురైన విషయమై ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

\- ఎర్ర ప్రశాంత్, ఏఈ, ఐబీ శాఖ

రాళ్ల వానతో పంట నష్టం

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లి, జింకురాం తండా, వస్రాంతండాల్లో ఆదివారం వడగళ్ల వాన కురిసింది. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం కల్లాల్లో తడిసింది. పొలాల్లో ధాన్యం రాలి నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో నష్టపోయే అవకాశం ఉందని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

పొలంలో వడ్లు రాలాయి



వడగండ్ల వానతో పొలంలో ధాన్యం రాలింది. రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలి. అధికారులతో సర్వే నిర్వహించి నష్టపరిహారం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

\- నాగండ్ల భాస్కర్, కొలన్‌పల్లి రైతు



పొలంలో రాలిన ధాన్యం

అంబేడ్కర్ భారత సమాజానికి మార్గదర్శి

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : భారత రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భారత సమాజానికి మార్గదర్శిగా నిలిచాడని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ తుప్పరి సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వికాస్ ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ పేదల బతుకుల్లో వెలుగులు నింపాడని చెప్పారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసినవారితో పాటు సహకరించిన వారిని ఆయన అభినందించారు. అంబేడ్కర్ సంఘం గీసుకొండ అధ్యక్షుడు దౌడు ప్రవీణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, నాయకులు దౌడు భరత్, వీరగోని శంకరయ్య, కర్ణకంటి రామ్మూర్తి, కేదాసి మోహన్, గోదాసి చిన్న తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే

దేశాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం



ఖానాపురం : మాట్లాడుతున్న అశోక్



దుగ్గొండి : మాట్లాడుతున్న రాజేందర్

● బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్

ఖానాపురం : దేశాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు రాధారపు అశోక్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం 'గావ్ చలో.. బస్తీ చలో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకొస్తోందని తెలిపారు. గడచిన 11 ఏళ్లలో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని మోదీ రూ.10 లక్షల కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులను కోరారు. కార్యక్రమంలో నాయకులు జల్లి మధు, హేమంత్, యాకస్వామి, పాపయ్య, మల్లారెడ్డి, సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ ఆధ్వర్యంలో శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం చేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజేందర్ మాట్లాడారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని కోరారు. తొలుత గ్రామంలోని హనుమాన్ ఆలయాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ ఇన్‌చార్జ్ బానోతు రమేశ్, పల్లకొండ శ్రీను, ఎలకంటి నాగరాజు, గోగుల రాజిరెడ్డి, రవి, గురుమూర్తి, రాజయ్య, ఐలోని, శంకర్, శ్రీధర్, నవీన్, వినయ్, గణేశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోంది. దర్గాలో భక్తులు, ప్రజలకు నీరు సరఫరా చేసే బావి, కరెంటు మోటార్ల గదికి వెళ్లే దారిని కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టారు. మండల పంచాయతీ అధికారి స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న అన్నారంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ కట్టడాలు చేపట్టినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూకబ్జాకు పాల్పడి అక్రమ నిర్మాణం చేపట్టిన వారిపై కేసు నమోదు చేసి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీపీ మండల్‌కు నివాళి



నర్సంపేట : పట్టణంలోని బీసీ పవర్ కార్యాలయంలో ఆదివారం బిందేశ్వరి ప్రసాద్ (బీపీ) మండల్ 42వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మండల్ చిత్రపటానికి బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్ నివాళులర్పించి మాట్లాడారు. మండల్ ఓబీసీల హక్కుల కోసం చారిత్రాత్మక పోరాటం చేపట్టారని కొనియాడారు. ఓబీసీల హక్కుల కోసం మండల్ చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాల్నె సుభాష్, కోడి అశోక్, శ్రీరామోజు మురళి, గణేశ్, పైండ్ల పవన్, గాదం స్వప్న, కొండోజు కార్తీక్, కొల్లూరి చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు

సంగెం : రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలైన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మండలంలోని గాడిపల్లికి చెందిన గాజు వైష్ణవి గవిచర్లలోని మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. వైష్ణవి రోజూ స్కూల్‌కు ఆటోలో వచ్చి వెళ్తోంది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం వైష్ణవి గవిచర్లలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో నీళ్లు తాటి రోడ్డు దాటుతుండగా తీగరాజుపల్లి దిశగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వైష్ణవికి తీవ్ర గాయాలు కావడంతో ఆమెను హనుమకొండలోని ఆస్పత్రిలో చేర్చారు. వైష్ణవి తండ్రి సంతోశ్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయడంతో ప్రమాదానికి కారణమైన బాషిపాక సన్నీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

మేకపోతుల ప్రభబండితో తరలిన నాయకులు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలో జరగనున్న శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణానికి బీజేపీ నాయకులు మేకపోతుల ప్రభబండితో బయలుదేరి వెళ్లారు. జీడిగడ్డతండా గ్రామానికి చెందిన భూక్య హరీష్ ఇంటి నుంచి ప్రభ బండితో వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సంగెం శంకర్, దుంకదువ్వ రంజిత్, విజయ్‌కుమార్‌రెడ్డి, సుమన్, చీకటి చిరంజీవి, బక్కతట్ల రవీందర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



నర్సంపేట : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూబెన్



నల్లబెల్లి : ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు



నెక్కొండలో..

నర్సంపేట : పట్టణంలోని కల్వరి బాప్టిస్ట్ చర్చిలో మట్టల ఆదివారం ఆరాధన మహోత్సవం నిర్వహించారు. పట్టణంలో మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ పిబి.రూబెన్ శాంతి మార్గాన్ని బోధించాడు. అనంతరం కల్వరి బాప్టిస్ట్ సంఘ పాస్టర్ కమిటీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మారపెల్లి అశోక్, సెక్రటరీ సదిరం దేవేందర్, ట్రెజరర్ పరికి ప్రశాంత్, సలహాదారు ఆకునూరు సాంబయ్య, జేరిపోతుల ప్రభాకర్, జన్ను శ్రీను, తదతరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలో సీఎస్ఐ పరితోమా చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు యేసు సిలువతోపాటు ఈత మట్టలను చేత పట్టుకుని భక్తి గీతలు ఆలపిస్తూ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చిలో రెవరెండ్ ప్రసాద్ దైవ సందేశం వినిపించారు. తొలుత సండే స్కూల్ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాస్టేట్ సెక్రెటరీ నాగెల్లి ప్రకాశ్, ట్రెజరర్ కనుకం నవీన్, స్త్రీల మైత్రి చైర్మన్ సంయుక్త రాణి, ఉమెన్ సెక్రటరీ నాగెల్లి పావని, నాయకులు పరికి రత్నం, పాడేటి ప్రకాశం, కల్లెపల్లి రఘువరణ్, కొండి అనుష, జన్ను కర్ణకర్, ఈదునూరి పీటర్, మనుగొండ శ్రీలత, సువర్ణ, ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : స్థానిక సీఎస్ఐ లూకా చర్చి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో కామెర సంపత్‌కుమార్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ రాము, నాయకులు జవాజి మాణిక్యం, కందిక వెంకన్న, కందిక మాణిక్యం, మునుకుంట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ



నర్సంపేట రూరల్ : రాజపల్లిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజత్సోతవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ కోరారు. నర్సంపేట మండలంలోని రాజపల్లిలో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పొన్నం రమేశ్, కార్యదర్శి గోపు వీరారెడ్డి, ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, కోశాధికారి గుండు సారయ్య, నాయకులు నూనె కుమారస్వామి, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. ఈనెల 27న తలపెట్టిన సభకు అన్ని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అభివృద్ధే లక్ష్యంగా పని చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. సమావేశాల్లో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు మస్తాన్, వల్లెపు శ్రీనివాస్, తోట రవి, కుమారస్వామి, ఆబోతు అశోక్, సత్యనారాయణ, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు.. పిల్లలు జాగ్రత్త



● ఎటు వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనించాలి

వర్ధన్నపేట : వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ విద్యార్థులకు గత నెల 15 నుంచి ఈనెల 23 వరకు ఒంటిపూట బడులు ప్రకటించింది. ఈ క్రమంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక విద్యార్థులు స్కూల్‌కు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి రావడం సహజం. అనంతరం బయట ఆటలు ఆడుకుంటారు. ఒంటిపూట బడుల నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవడం కీలకం. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు? ఏం చేస్తున్నారు? వంటి విషయాలపై తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఇలా చేస్తే మేలు

ఒంటి పూట బడుల నేపథ్యంలో చిన్నారులు మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఆడుకోవడానికి బయటకు వెళ్లడం పరిపాటి. ముఖ్యంగా గ్రామాల్లో చెరువులు, కాల్వలు, వాగుల వద్దకు స్నేహితులతో ఈత నేర్చుకోవడానికి వెళ్లే అవకాశాలున్నాయి. ఈత రాక ఏటా పలువురు చిన్నారులు మృతి చెందిన ఘటనలు తెలిసిందే. ఈత రాని పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్దల సమక్షంలోనే ఈత నేర్చుకునేలా అవగాహన కల్పించాలి. ప్రస్తుత తరం పిల్లలు ఎక్కువగా మొబైల్ ఫోన్లు, టీవీ చూస్తూ కాలం వృథా చేస్తున్న పరిస్థితి నెలకొంది. అలా కాకుండా పిల్లలకు నీతి కథల పుస్తకాలు, వేమన శతకాలు, రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలు, మహనీయుల చరిత్రలు అందుబాటులో ఉంచాలి. విద్యార్థుల ఏకాగ్రత పెంచేలా ధ్యానం, చదరంగం, క్యారమ్ వంటి వాటిని ప్రోత్సహించాలి. సాయంత్రం వేళల్లో బయట క్రికెట్, షటిల్, కబడ్డీ వంటి ఆటలు ఆడుకునేలా చూడాలి. రాత్రి వేళల్లో త్వరగా నిద్రపోయేలా చూసి తెల్లవారుజామున నిద్ర లేచిన వెంటనే శ్రద్ధతో చదువుకునే అలవాటు చేయాలి.

ఎండ తగలకుండా..



ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత ఉంటుంది. ఆ సమయంలో పిల్లలు బయటకు రాకూడదు. లేనిపక్షంలో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే మధ్యాహ్న వేళల్లో అత్యవసరమైతే తప్ప పిల్లలు బయటకు రాకూడదు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు, టోపీలు వినియోగించాలి. నీళ్లు ఎక్కువగా తాగేలా, సకాలంలో భోజనం చేసేలా చైతన్యవంతం చేయాలి.

\- భరత్, డాక్టర్, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి

'బాలాజీ'లో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

నర్సంపేట : పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఆదివారం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. ముందుగా ఏట సురేశ్, బాలాజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మోర్తాల రాంరాజ్‌తో కలిసి స్కూల్ ప్రిన్సిపాల్ పి.రాజేంద్ర ప్రసాద్ ప్రశ్నపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. పరీక్షలో విద్యార్థుల్లో ఉన్న టాలెంట్ బయట పడుతుందని తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష ఉంటుందని చెప్పారు. ఆరు నుంచి 9వ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలాజీ వంటి సబ్జెక్టులపై పరీక్ష ఉంటుందని వివరించారు. పరీక్షలో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచే విద్యార్థికి ఫీజులో 50, ద్వితీయ స్థానంలో నిలిచే విద్యార్థికి 30 శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. వేసవి సెలవుల నేపథ్యంలో స్కూల్‌లో ఈనెల 29 నుంచి మే 25 వరకు మెగా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. డ్యాన్స్, అబాకస్, యోగ, భగవద్గీత, బాస్కెట్‌బాల్, వాలీబాల్, కరాటే, క్రికెట్, చెస్, క్యారమ్ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు వేసవి శిక్షణా తరగతులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.జ్యోతి, అక్షర ద స్కూల్ ప్రిన్సిపాల్ జి.భవాని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి'

పర్వతగిరి : సమాజంలోని ప్రతిఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ కోరారు. మండలంలోని ఏబీతండా, చింతనెక్కొండ, బట్టుతండా గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రచించిన రాజ్యాంగాన్ని సవరణ పేరుతో నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. అన్ని గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామని చెప్పారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మాలోత్ రవి, ఓరుగంటి శ్రీనివాస్, చాంప్లా నాయక్, రాంచందర్‌రావు, సువార్త, సావిత్రి, బందెల వెంకన్న, దబ్బెట నర్సయ్య, నరుకుడు రవీందర్, భాస్కర్ నాయక్, మాసాని యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.